ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
***
నల్లగొండ
5
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 కనిష్ఠం 23.0

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేసి రెండు యూనిట్ల నుంచి 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని, వచ్చే ఏడాది మార్చినాటికి 5 యూనిట్లతో 4వేల మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్లో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మాణంలో ఉన్న థర్మల్ పవర్ ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, అధికారులు, మంత్రుల బృందానికి ఘన స్వాగతం పలికారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో యాదాద్రి థర్మల్ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదాద్రి పవర్‌ప్లాంట్‌ను.. త్వరగా పూర్తి చేయాలి

- సెప్టెంబరులో 1600 మెగావాట్ల విద్యుదుత్పత్తిని మొదలు పెట్టాలి
- అధికారులతో సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

ఇప్పటికే రెండుసార్లు ప్రాజెక్టు అంచనా వ్యయాలు పెంచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని, ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారంగా మారిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్టును తొందరగా పూర్తి చేయకపోతే మోయలేని భారంగా మారుతుందన్నారు. అందుకే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించామని, ఈ క్రమంలోనే థర్మల్ పవర్ స్టేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉన్న యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులు ఎక్కడి నుంచి వస్తున్నారో.. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు సమాధానం ఇస్తూ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత స్థానికులకే అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరగా ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఓ వ్యవస్థను, ఓ సమర్థమైన అధికారిని నియమించుకోవాలన్నారు. రోడ్లు, రైల్వే వంటి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారి మంత్రులతో, ఉన్నతస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటారని సూచించారు. ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసేందుకు ఓ పాలసీని రూపొందించాలని అధికారులు భావిస్తే అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ప్రభుత్వ సహకారం ఉంటుంది

ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వ పక్షాన ఎల్లవేళలా సంపూర్ణ సహకారం ఉంటుందని భట్టి విక్రమార్క అన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్ రంగాలవైపు వెళుతున్నారని వివరించారు. సోలార్, హైడ్రో, విండ్ ఎనర్జీ వంటి గ్రీన్ ఎనర్జీ రంగాలు విస్తృతంగా పెరుగుతున్నాయని, అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలోపు యాదాద్రి థర్మల్ పవర్ పనులు పూర్తి కావాలన్నారు. గత ప్రభుత్వం యాదాద్రి, భద్రాద్రిలో థర్మల్ వైపు మొగ్గు చూపిందన్నారు. పునరుత్పాదక విద్యుత్ తక్కువ ధరకు, కాలుష్యరహితంగా అందుబాటులోకి వస్తుందన్నారు. బీహెచ్‌ఈఎల్ పేరున్న ప్రభుత్వరంగ సంస్థ యాదాద్రి పనులు త్వరగా పూర్తి చేయకపోతే ఆ సంస్థకు చెడ్డ పేరు వస్తుందన్న విషయాన్ని సంస్థ అధికారులు, ఇంజనీర్లు దృష్టిలో పెట్టుకోవాలన్నారు. పాత ప్రభుత్వం ఆలోచనలు, అలవాట్లు పద్ధతులు మార్చుకోకపోతే ప్రాజెక్టు వ్యయం పెరిగి ప్రతీ రూపాయి రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారుతుందన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన ముడి పదార్థాలు అందించేందుకు మైనింగ్ కార్పొరేషన్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. అవసరమని భావిస్తే వారితో సమావేశం ఏర్పాటు చేసుకుందామన్నారు. ఈ ప్రాజెక్టు సంపద రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలని, ఏ కొందరి వ్యక్తులవరమో కాకూడదన్నారు. ఈ ఆశయం నెరవేర్చే క్రమంలో అధికారులు ఎలాంటి బెదిరింపులకు లొంగాల్సిన పని లేదన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 24గంటలు తనతోపాటు సీనియర్ మంత్రులు, అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.

ప్రాజెక్ట్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోను

ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రాజెక్టు పురోగతి పనుల గురించి ప్రశ్నించగా ఏడాది సెప్టెంబరులో రెండు యూనిట్ల ద్వారా 1600మెగావాట్ల విద్యుత్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తామని, మార్చి 2025 నాటికి మొత్తం ఐదు యూనిట్ల ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెస్తామని వివరించారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే కాలుష్యం, కలుషితనీరు మూలంగా స్థానికులకు ఎదురయ్యే ఇబ్బందులు వాటి పరిష్కారానికి తీసుకునే మార్గాల గురించి డిప్యూటీ సీఎం ఆరా తీశారు. స్థానికంగా వినియోగించే నీటిని తిరిగి శుద్ధి చేసి ప్రాజెక్టు అవసరాలకే వినియోగిస్తామని తెలిపారు. స్థానికంగా ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణాలు వాటి వడ్డీ రేట్ల గురించి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణాలను మంత్రి ఉత్తమ్ అడిగి తెలుసుకున్నారు. కరోనా మూలంగా ఆరు నెలలపాటు పనులు నిలిచి ఇతర రాష్ట్రాల కార్మికులు స్వస్థలానికి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఎన్ని క్వార్టర్స్ అందుబాటులో ఉన్నాయి, ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చేసరికి ఎన్ని క్వార్టర్స్ నిర్మిస్తారు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, సబ్ కాంట్రాక్టులు, ఇతర చిన్న చిన్న పనుల్లో స్థానికులకే అవకాశం కల్పించడం ద్వారా చేయూత నివ్వాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను కోరారు. ప్రాజెక్టు చేపట్టిన నాటి వ్యయం, ఆ తర్వాత రెండుసార్లు పెంచిన అంచనాలను అధికారులు వివరించారు. ప్రస్తుతం పవర్ ప్లాంట్‌లో జరుగుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులను ప్రజెంటేషన్ రూపంలో మంత్రులకు వివరించారు. సమావేశంలో విద్యుత్ శాఖ సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ట్రాన్స్‌కో డైరెక్టర్ అజయ్, పవర్ ప్లాంట్ సీఈ నమ్మయ్య, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, అదనపు కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

థర్మల్ వద్ద మంత్రులకు వినతుల వెల్లువ

దామరచర్ల: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద నిర్మాణంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ పనుల పర్యవేక్షణను శనివారం వచ్చిన ఉపముఖ్యమంత్రి, మంత్రులకు వినతులు వెల్లువెత్తాయి. పరిశ్రమలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద నుంచి నేరుగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశం నుంచి బయటకు వచ్చిన వారికి పరిశ్రమ ఉద్యోగులతోపాటు స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.గత మూడేళ్ల క్రితం తమను పాల్వంచలోని కేటీపీఎస్ నుంచి సుమారు 270 మంది కార్మికులను యాదాద్రి థర్మల్ పరిశ్రమకు బదిలీ చేశారని, పరిశ్రమ నిర్మాణ దశలో తమకు పనిలేదని తెలిపినప్పటికీ అకారణంగా బదిలీ చేశారని తమను తిరిగి కేటీపీఎస్‌కు పంపించాలని వినతిపత్రంలో కార్మికులు కోరారు.

ఎత్తిపోతల పథకాలతో సస్యశ్యామలం

● నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, ఫిబ్రవరి 24: ఎత్తిపోతల పథకాలతో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు సాగు నీరందించి సస్యశ్యామలం చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలం నక్కగూడెంలో రూ.35 కోట్లతో పునర్నిర్మిస్తున్న నక్కగూడెం లిఫ్ట్‌ఇరిగేషన్ పథకానికి డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు భవనాలు, ఫొటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నూతనంగా 3,200 ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయన్నారు.

కేసీఆర్ చేతగాని తనం వల్లే..

కాసులకు కక్కుర్తిపడి కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో మునిగిపోయేలా చేశారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పెద్ద ఎత్తున కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందన్నారు. ప్రాజెక్ట్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేసీఆర్ నిర్లక్ష్యం, చేతగానితనం, అతని డిజైన్ వల్లనే మేడిగడ్డ బ్యారేజీ ముక్కలవుతుందన్నారు. ఏపీ రాష్ట్ర సీఎం జగన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దోస్తీవల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, శ్రీశైలం ప్రాజెక్ట్ పైన పోతిరెడ్డిపాడు ద్వారా ప్రతిరోజు 10వేల క్యూసెక్కుల నీరు అక్రమంగా ఏపీ తరలించుకుపోతుందని ఆరోపించారు. నాడు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి ఒక్కటై కృష్ణా నీటిని తెలంగాణకు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను ఇవ్వలేదన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి

సామాన్య మానవుడికి సత్వర న్యాయం చేయాలి



కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే

కోదాడ, ఫిబ్రవరి 24: కేసులు పెండింగ్‌లో ఉంచకుండా సామాన్య మానవుడికి సత్వర న్యాయం చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కోదాడ లో సబ్‌కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభోత్సవంతోపాటు కోదాడ కోర్టు భవనానికి శంకుస్థాపనచేసి మాట్లాడారు. వివాహ సంబంధాల వివాదాలతో న్యాయంకోసం కోర్టుకు వస్తున్న మహిళలను పదేపదే తిప్పకుండా సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు అదనపు కోర్టులను మంజూరు చేస్తున్నామన్నారు. న్యాయవాదులు వృత్తి నైపుణ్యం పెంచుకొని న్యాయవ్యవస్థకు వన్నెతేవాలన్నారు. హైకోర్టు జడ్జిలు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.లక్ష్మణ్, జస్టిస్ పుల్లాకార్తీక్‌లు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యా విలువలను అందించాలన్నారు. భవిష్యత్ తరాలు న్యాయవాది వృత్తిని స్వీకరించేలా ఆదర్శంగా నిలవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున మాట్లాడుతూ కోదాడ కోర్టు భవన నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా జడ్జి జి.రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లా నాగేశ్వర్‌రావు, కొల్లి సత్యనారాయణ, జూనియర్ సివిల్ జడ్జి భవ్య, న్యాయవాదులు గాలి శ్రీనివాస నాయుడు, సాదు శరత్‌బాబు, సీతారామరాజు, పాషా, మునిసిపల్ ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మున్సిపల్ కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు. అంతకుముందు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు వేద మంత్రాలతో, పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్న సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తిలను సన్మానించారు.

కొనుగోలు రశీదు తప్పకుండా ఇవ్వాలి

జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 24: ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు, తిరుమలగిరి, రంగారెడ్డిగూడెం ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల నిల్వ, రికార్డులను మండల వ్యవసాయాధికారి పాండుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీడీలర్ రైతులకు ఆధార్‌కార్డు ఆధారిత వేలిముద్ర ద్వారా ఈ-పాస్ మెషిన్‌తో మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు. అవసరమైన ఎరువులను నిల్వ ఉంచుకోవాలన్నారు. జిల్లాలో ఎవరైన నకిలీ విత్తనాలను విక్రయిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.



సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఒక్క క్షణం ఆలోచిస్తే.. నిలుస్తుంది ప్రాణం

బంగారు భవిష్యత్ కలిగిన పలువురు చిన్నారులు ఆత్మన్యూనతా భావానికి గురవుతున్నారు. చిన్నపాటి సమస్యలను కూడా తట్టుకోలేక అల్లాడుతున్నారు. తమ లో చెలరేగుతున్న మానసిక సంఘర్షణలను, తమ ఇష్టా అయిష్టాలను పంచుకునే స్వేచ్ఛ కరువై ఒంటరితనానికి గురవుతున్నారు. ఫలితంగా బాల్యదశలోనే జీవితాలను బలవంతంగా ముగించుకునేందుకు కఠోర నిర్ణయం వైపు అడుగులు వేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నలుగురు విద్యార్థినుల ఆత్మహత్యలు సంచలనం రేకెత్తించాయి. అయితే జీవితంపై ఆశలు [illegible] రిల్లి.. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న సమయంలో ఆ ఒక్క క్షణం ఆలో[illegible] రాలను చేరవచ్చంటున్నారు మనోవిజ్ఞాన వేత్తలు.

- భువనగిరి టౌన్

- మానసిక సంఘర్షణకు లోనవుతున్న చిన్నారులు
- అనుబంధంతోనే పరిష్కారం అంటున్న నిపుణులు
- గెలుపునకు ఓటమి మార్గమని విద్యార్థులు గ్రహించాలి

పరీక్షల సీజన్ ప్రారంభం కావడంతో విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది. తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటూ పరీక్షలకు ముందే ఫలితాలపై అంచనాలు వేసుకుంటూ నిరాశకు లోనవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మానసికంగా బలహీనులు, ఒంటరితనానికి లోనవుతున్న విద్యార్థులు ఆత్మహత్య ఆలోచనలను చేస్తుండడం దుష్పరిణామం. 15 రోజుల వ్యవధిలో భువనగిరిలో, సూర్యాపేటలో నలుగురు బాలికలు ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. అదే సమయంలో పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ దుస్థితికి ప్రభుత్వంతోపాటు తల్లిదండ్రులు, విద్యాసంస్థల వైఖరే కారణమని విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌పై కోటి ఆశలతో కుటుంబానికి దూరంగా సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల్లో తలెత్తే సమస్యలు, సంఘర్షణను నివారించేందుకు మోటివేటర్లను నియమించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఆశలకోసం విద్యార్థులపై సామర్థ్యానికి మించి ఒత్తిడి చేస్తుండడం, విద్యాసంస్థలు, ఫలితాలే మార్క్‌గా విద్యాసంస్థలను నడుపుతున్న యాజమాన్యాలు విద్యార్థుల క్రీడలు, సాంస్కృతిక తదితర ఆసక్తిని హరిస్తూ కేవలం తరగతి గదులకే పరిమితం చేస్తూ ఒంటరి చేస్తున్నారు. తమ మనోభావాలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం, పరీక్షల భయాన్ని పోగొడుతూ భవిష్యత్‌కు భరోసా కల్పించగలిగే వాతావరణం రూపొందించగలిగితేనే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయంగా ఉంటుంది.

ఈ నెల 28 నుంచి పరీక్షల సీజన్

ఈ నెల 28వ తేదీ నుంచి పరీక్షల సీజన్ ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 80వేల మంది విద్యార్థులు ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలకోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు తల్లిదండ్రులు చేయాల్సిందల్లా కేవలం పిల్లలపై పరీక్షా ఫలితాలకోసం ఒత్తిడి చేయకుండా స్వేచ్ఛగా చదువుకునే అవకాశం కల్పించడం, సక్రమ మార్గంలోనే పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకుంటే తదుపరి పరీక్షల్లో విజయం కోసం మానసికంగా సిద్ధం చేయడమేనని వ్యక్తిత్వ వికాస నిపుణులు సూచిస్తున్నారు.

ఆత్మహత్య అంచు వరకు వెళ్లి.. ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులు

డాక్టర్ కావాలని ఆ ఇద్దరు విద్యార్థుల జీవిత లక్ష్యం. ఇందుకోసం అతను రెండు సార్లు లాంగ్ టర్మ్, ఆమె మూడు సార్లు లాంగ్ టర్మ్ కోచింగ్‌లు తీసుకున్నారు. అయినప్పటికీ నీట్‌లో మెరుగైన ర్యాంక్ రాదేమోనసే ఆత్మన్యూనతా భావంతో ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈమేరకు హాస్టల్ గదిలో మెడకు ఉరి బిగించుకున్న సమయంలోనే అతని సెల్‌ఫోన్‌కు మిత్రుడు కాకతాళీయంగా ఫోన్ చేశాడు. అయితే ఉరికి సిద్ధపడిన అతను వచ్చిన ఫోన్‌కోసం ఉరి తాడును తొలగించుకొని ఫోన్‌చూసి మిత్రుడితో మాట్లాడుతూ తానెదుర్కొంటున్న ఇబ్బందిని వివరించగా మిత్రుడు ఫోన్ ద్వారానే కౌన్సిలింగ్ చేశాడు. ఫలితంగా అతను తన ప్రయత్నాన్ని మానుకోగా మరుసటి వారంలో వచ్చిన నీట్ ఫలితాల్లో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొంది ప్రస్తుతం పీజీ చేస్తున్నాడు. మరో ఘటనలో ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ బాలిక ఇంటర్‌తోపాటు లాంగ్ టర్మ్‌లో మూడు పర్యాయాలు ఆత్మహత్యకు ప్రయత్నించింది. అయితే ప్రతీసారి తాను చేసిన ప్రయత్నాలను, తనలో నెలకొన్న మానసిక సంఘర్షణను కుటుంబ సభ్యులకు వివరించింది. దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు తమ కుమార్తె పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి మనో ధైర్యాన్ని నింపడంతో ఆమె ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతుంది. తనలో నెలకొన్న మానసిక సంఘర్షణను తల్లిదండ్రులకు చెప్పుకునే స్వేచ్ఛ ఉన్నందునే తన జీవిత లక్ష్యమైన ఎంబీబీఎస్‌ను చదవగలిగానని, ఇందుకు తల్లిదండ్రులందరూ తనను, తన తల్లిదండ్రులను, వారి మధ్య ఉన్న అనుబంధాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరుతున్నట్లు చెబుతోంది.

క్రికెటర్ మహ్మద్ షఫీ కూడా బాధితుడే..

నేడు దేశం గర్విస్తున్న ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ కూడా ఒత్తిడితో ఆత్మహత్యకు ప్రయత్నించిన బాధితుడే. అతను స్వయంగా మీడియాలో పేర్కొన్న ప్రకారం క్రికెటర్ కావాలనే సంకల్పంలో ఎదురైన వైఫల్యాలను తట్టుకోలేక పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే ప్రతీసారి తన వైఫల్యాలను, తన ఆలోచనలను కుటుంబసభ్యులతో పంచుకునేవాడని, ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తనకు అండగా నిలిచి, తన వైఫల్యాలను విజయాలుగా చూపిస్తూ ప్రోత్సహించిన తీరుతోనే ఆత్మహత్య చేసుకోవాలన్న భావన వీడి నేడు క్రికెటర్‌గా నిలిచినట్లు చెప్పారు. తన వైఫల్యాల్లో కుటుంబ సభ్యులు వెన్నంటి ఉండడంతోనే ఇది సాధ్యమైందన్నారు.

పరీక్షలు గీటురాయి కాదు



వార్షిక పరీక్షలు పిల్లల విద్యా సామర్థ్యానికి గీటురాయి కాదు. పరీక్షలలో సమర్థత, చూపితేనే వారి భవిష్యత్ భద్రంగా ఉంటుందనే భావనను పిల్లలతోపాటు తల్లిదండ్రులు వీడాలి. తమ విద్యా సంస్థల ప్రచారంకోసం ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులపై మానసిక, శారీరక ఒత్తిడి పెంచవద్దు.

- ఎం రాజేశ్ చంద్ర, డీసీపీ యాదాద్రి భువనగిరి జోన్

పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాం.



పరీక్షలపై విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించే లక్ష్యంతో జిల్లాలోని 8,9,10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ నాగేశ్వర్‌రావుచే ఇప్పటివరకు భువనగిరి, మోత్కూరు లో అవగాహన తరగతులు పూర్తి కాగా త్వరలో చౌటుప్పల్‌లో కూడా నిర్వహించనున్నాము. పరీక్షలు జరిగేన్ని రోజులు కూడా సాధారణ రోజుల్లాగానే చదివి దీగా ఉండాలి.ఒత్తిడితో కాకుండా ఇష్టంతో చదివితేనే సత్ఫలితాలు సాధిస్తారు.

- కె.నారాయణరెడ్డి, డీఈవో, యాదాద్రి

వ్యక్తిగత సమస్యలా..? చదువుపై ఒత్తిడా?

నల్లగొండ, భానుపురి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థినుల ఆత్మహత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో విద్యార్థిలను తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులతోపాటు వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థినులపై చదువుల విషయంలో ఒత్తిడా..? మానసికంగా ఇబ్బందులా..? అనేది కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. పోలీసులు సైతం వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నప్పటికీ విద్యార్థినుల ఆత్మహత్యకు గల కారణాలు అంతుపట్టడంలేదు. భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో ఈ నెల 3వ తేదీన ఇద్దరు విద్యార్థినులు అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. వారిద్దరు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించినప్పటికీ, ఇప్పటికి మిస్టరీ అలానే మిగిలిపోయింది. ఎస్సీ హాస్టల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థినులు కోడి భవ్యశ్రీ, గాదె వైష్ణవిలు హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నప్పటికీ విద్యార్థి సంఘాలతో పాటు కుటుంబ సభ్యులు పలుఅనుమానాలు వ్యక్తం చేశారు. ఇకపోతే సూర్యాపేట జిల్లా కేంద్రసమీపంలోని ఇమాంపేట బీసీ గురుకుల బాలికల పాఠశాలలో ఫిబ్రవరి 9వ తేదీన ఇంటర్ విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి అనుమానస్పదస్థితిలో మృతిచెందింది. ఈ నెల 17వ తేదీన అదే గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మోతె మండలం బుర్కచర్ల గ్రామానికి చెందిన అస్మిత హైదరాబాద్‌లో తల్లితో కలిసి నివాసం ఉంటున్న ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం పలువురిని కలచివేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 29 గురుకులాల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే అన్ని పాఠశాలల్లో మోటివేటర్లను నియమించి, విద్యార్థుల్లో మనోధైర్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పట్టభద్ర ఓటర్లు 4,27,289

- వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ జాబితా వెల్లడి
- జాబితాపై వచ్చే నెల 14 వరకు అభ్యంతరాల స్వీకరణ

నల్లగొండ, ఫిబ్రవరి 24: వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్ర ఓటర్ల ముసాయిదాను నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వెల్లడించారు. శనివారం ఆమె నల్లగొండ జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం పట్టభద్ర ఓటర్లు 4,27,289 మంది ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,59,664 మంది ఓటర్లు, నల్లగొండ జిల్లాలో 1,53,824 మంది ఓటర్లు, ఖమ్మం జిల్లాలో 1,13,795 ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 2,66,622 మంది కాగా, పురుష ఓటర్లు 1,60,661 మందిగా నమోదు చేసుకున్నారు. ఇందులో థర్డ్ జెండర్లు ఆరుగురు నమోదు చేసుకున్నారు. ఆయా జిల్లాల్లోని 600 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 24 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించునున్నట్లు వివరించారు. జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.




వైభవంగా వేణుగోపాలుడి తిరు కల్యాణం

హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం శనివారం అద్యంతం అంగరంగ వైభవంగా జరిగింది. హరిహర క్షేత్రంగా భాసిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి గ్రామ వారిజాల గుట్టపై వెలిసిన వేణుగోపాలస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న వార్షిక అధ్యయన, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తిరు కల్యాణ మహోత్సవ తంతును వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్ప దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు ముత్యాల తలంబ్రాలను అందజేశారు.

ప్రధాన యాజ్ఞీకుడు ప్రతాపురం మత్స్యగిరి స్వామి పర్యవేక్షణలో అర్చకుడు కారంపూడి వెంకటాచార్యులు శిష్యబృందం కల్యాణతంతు నిర్వహించింది. లోకా సమస్తా సుఖినోభవంతు అని వేద పండితులు ఆశీస్సుండగా... వేణుగోపాలుడు తన దేవేరులు రుక్మిణీ, సత్యభామ అమ్మవార్ల మెడలో మాంగళ్యధారణ చేసే ఘట్టం భక్తులను తన్మయులను చేసింది. వేడుకల్లో దేవదాయ శాఖ ఏసీ మహేంద్రకుమార్, కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి, చంద్రపవన్‌రెడ్డి, ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఉండ్ర భాగ్యమ్మ, మాజీ సర్పంచ్‌లు గోసుల భద్రాచలం, దూదిమెట్ల సత్తయ్య, స్రవంతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, దార యాదయ్య, రేగట్టె నర్సిరెడ్డి, పల్లెంల అచ్చాలు పాల్గొన్నారు.



కల్యాణ వేదికపై ఆసీనులైన ఎమ్మెల్యే వేముల, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి దంపతులు

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి24: గ్రామ సెక్రటరీ సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురంలో జరిగింది. రూరల్ ఎస్ఐ నరేష్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం ఈదులగూడకు చెందిన జెల్లి పుష్పకు తుర్క పెద్దిరాజు అవంతీపురంలోని తన ప్లాట్‌ను విక్రయించాడు. గ్రామకంఠంలోని సర్వే నెంబర్ 628ఇంటి నెంబర్‌లోగల 3-22/1పైగల 386 గజాలను పుష్ప రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించింది. డాక్యుమెంట్లపై ఉన్న పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని సబ్‌రిజిస్ట్రార్ అరవింద్ గుర్తించి విచారణ చేయించగా ఫోర్జరీగా నిర్ధారణకు వచ్చి పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. దీనిపై అవంతీపురం గ్రామపంచాయతీ కార్యదర్శి గాయత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని పెద్దిరాజు ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించి పోలీసులు అతనిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.



చిన్నారికి జంపన్న జలాలతో పుణ్యస్నానం..



తిరుగుప్రయాణంలో బై బై చెప్తున్న భక్తులు

చివరి రోజూ.. అదే జోరు..

- చివరిరోజూ మేడారానికి పోటెత్తిన భక్తులు
- తల్లులను దర్శించుకున్న స్పీకర్
- ప్రశాంతంగా దేవతల వనప్రవేశం
- ముగిసిన నాలుగు రోజుల జాతర

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు చివరి రోజు కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయనుండడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలు మూలల నుంచి, అదేవిధంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున చేరుకున్నారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిలాడాయి. గద్దెల ప్రాంగణం ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసిపోయింది.



తల్లుల వనప్రవేశం

తల్లుల వనప్రవేశం ప్రశాంతంగా జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సారలమ్మను కాక సారయ్య కన్నె పెల్లికి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు తరలించారు. దీంతో మేడారం మహాజాతర ముగిసింది.

ప్రముఖుల రాక

మేడారానికి శనివారం కూడా ప్రముఖుల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమ్మక్క, సారలమ్మను దర్శించి మొక్కులు చెల్లించారు. హెలికాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తుబంగారాన్ని సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సైతం వనదేవతలను దర్శించుకున్నారు.

ధన్యవాదాలు తెలిపిన సీతక్క

జాతరను విజయవంతం చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ శాఖల అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఇతరశాఖల అధికారులను అభినందించారు.

సంప్రదాయ ఊరేగింపు

సమ్మక్క, సారలమ్మ జాతర ముగుస్తుండడంతో చివరి రోజు శనివారం మేడారంలో ఆదివాసీలు సంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కోయ జాతుల వారు సుమారు 300 మంది సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం సమ్మక్క గద్దెల వద్దకు చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతిలో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో సంప్రదాయ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. శివసత్తులు పూనకాలతో శిగాలూగారు.

ముగిసిన మహాజాతర

అంగరంగ వైభవంగా సాగిన మేడారం మహాజాతర శనివారం ముగిసింది. నలుగురు దేవతల వనప్రవేశంతో నాలుగు రోజుల సంరంభానికి తెరపడింది. భక్తులు తిరుగుబాట పట్టడంతో మేడారంలో గుడారాలన్నీ ఖాళీ అయ్యాయి. జనహోరుతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోయింది. 'రెండేళ్లకు మళ్లీ వస్తాం తల్లీ.. కరుణించు' అంటూ మొక్కుకుంటూ భావోద్వేగంతో స్వగ్రామాల బాట పట్టారు.



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి తల్లులకు మొక్కుతున్న భక్తులు



ఆర్టీసీ బస్సుల్లో తిరుగు ప్రయాణమైన భక్తులు



ఆర్టీసీ ప్రాంగణానికి వెళ్తున్న భక్తులు

ఏ రంగంలో ఉన్నా మానవతా విలువలు పాటించాలి

తెలంగాణ బిగ్గెస్ట్ బ్రాండ్ అవార్డ్స్ -24 ప్రధానోత్సవంలో హీరో భానుచందర్, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలాచారి



తెలంగాణ బిగ్గెస్ట్ బ్రాండ్ అవార్డ్స్ అందుకున్న నల్లగొండకు చెందిన రమాదేవి

బేగంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏ రంగంలో ఉన్నా మానవతా విలువలను పాటించినప్పుడే ఆ వ్యక్తికి, సంస్థకు గుర్తింపు వస్తుందని సినీ హీరో భానుచందర్, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలాచారి, విశ్రాంత ఐఏఎస్, విద్యావేత్త లక్ష్మీకాంతం, ఇండియన్ రోలర్ స్కేటర్ అనూప్ యమా అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బేగంపేట కంట్రీక్లబ్‌లో తెలంగాణ బిగ్గెస్ట్ బ్రాండ్ అవార్డ్స్-24 కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గ్లోబల్ పినాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు రంగాలకు చెందిన నిపుణులకు సినీ హీరో భానుచందర్, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలాచారి, విశ్రాంత ఐఏఎస్ విద్యావేత్త లక్ష్మీకాంతం, ఇండియన్ రోలర్ స్కేటర్ అనూప్ యమా ఈ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తులు, సంస్థలు సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బిగ్గెస్ట్ బ్రాండ్ అవార్డ్స్-24 డైరెక్టర్ రిషిత రుమళ్ల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

- ఎన్‌వోసీ పేరిట పట్టామార్పిడి
- కబ్జాల్లో చెరువు శిఖం భూములు
- అక్రమిత భూముల్లో నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



సూర్యాపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. ఎన్‌వోసీ పేరిట భూకబ్జాదారులు అధికారుల సహకారంతో పక్కాగా పట్టాలు చేయించుకుంటున్నారు.నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, ఇతరవర్గాలకు గత ప్రభుత్వాలు జీవనోపాధి కోసం అసైన్డ్ కింద భూములను పంపిణీ చేశాయి. ఆ భూమిని విక్రయించడం, కొనుగోలు చేయడం నేరం. లబ్ధిదారుడు ఎంతకాలమైనా ఆ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందవచ్చు. అయితే అలాంటి అసైన్డ్ భూములకు కూడా కొంత మంది రియల్టర్లు ఎన్‌వోసీ పేరుతో కొనుగోలు చేసి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టా భూములకు ఆనుకున్న ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో ప్రభుత్వ భూములకు పట్టా నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. అదేవిధంగా కోదాడ, నేరేడుచర్ల, సూర్యాపేట ప్రాంతాల్లోని పలు చెరువుల పరిధిలోని వందలాది ఎకరాల శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఆక్రమణలపై ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. మేళ్లచెర్వు, చింతలపాలెం, మఠంపల్లి, పాలకవీడు మండలాల పరిధిలో వేల ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆయా భూములకు పట్టాలు పొంది విక్రయిస్తున్నారు. వీటితో పాటు జిల్లాలోని ఎస్సారెస్పీ, మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వలు కూడా కబ్జాకు గురయ్యాయి. మొత్తంగా ప్రభుత్వ భూములతో పాటు భూ దాన్,వక్ఫ్‌బోర్డు, చెరువు శిఖం,ఎస్ఎస్‌పీ, మూసీ ప్రాజెక్టులకు సంబంధించిన కాల్వలు కబ్జాకు గురయ్యాయి.

ఎన్‌వోసీ పేరుతో భూముల మార్పిడి

కబ్జాదారులు ఎన్‌వోసీ పేరుతో అసైన్డ్ భూములను పట్టాలు చేయించుకున్నారు. అసైన్డ్ భూములకు పక్కన ఉన్న పట్టా భూముల సర్వే నెంబర్లు జతచేసి అధికారులకు కొంతమొత్తంలో ముట్టచెప్పి ఎన్‌వోసీ పేరుతో పట్టాలుపొందారు. అంతేకాక లబ్ధిదారులకు తక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించి భూములను ఆక్రమిస్తున్నారు. కొన్నాళ్లతర్వాత వాటికి పట్టాలు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకుండా మౌనం వహిస్తున్నారు.

జిల్లాలో 1,21,681 ఎకరాల ప్రభుత్వ భూములు

సూర్యాపేట జిల్లా పరిధిలో ప్రస్తుతం 1,21,681 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అందులో 6వేల ఎకరాలు సీలింగ్ భూమి, 1,13,800 ఎకరాల ప్రభుత్వ భూమి,1,466 ఎకరాలభూదాన్ భూమి, 415ఎకరాలు వక్ఫ్‌బోర్డు భూమి ఉన్నాయి. వీటితో పాటు 31,623 ఎకరాలశిఖం భూములు ఉన్నాయి.అంతేకాకుండా జిల్లాలో 4,412ఎకరాల భూములను మైనింగ్ కోసం పలువురికి లీజుకుఇచ్చారు. అదేవిధంగా 1,199ఎకరాలను వివిధ అవసరాల నిమిత్తం కొంతమందికి అలాట్ చేశారు.

ఆక్రమిత భూముల్లో నిర్మాణాలు

కబ్జా చేసిన ప్రభుత్వ భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. వాటికి ప్రభుత్వం నుంచి అక్రమ మార్గంలో అనుమతులు పొందారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు కొంతమంది ఆక్రమించుకొని ఇతరులకు విక్రయించినట్టు గతంలోనే పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి.

చెరువు శిఖం భూములు కనుమరుగు

జిల్లాలోని చెరువు శిఖం భూములు కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు భూమి సుమారు 200 ఎకరాలు కాగా కొన్నేళ్లుగా కబ్జాలకు గురైంది. దాంతో పాటు ఎర్రకుంట చెరువు భూమి కూడా సుమారు 40ఎకరాలు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఇవేకాకుండా కోదాడ, హుజూర్‌నగర్ పరిసరాల్లో వెంచర్లలోని ప్రభుత్వ లేఅవుట్ భూములు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి. కోదాడ చెరువు శిఖం భూముల ఆక్రమణలపై స్థానికులు కొన్నేళ్లుగా ఉద్యమిస్తున్నా సంబంధిత భూములను మాత్రమే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

జిల్లాలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నాం. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేయిస్తాం. కేటాయింపులు జరిపిన అసైన్డ్ భూముల్లో లబ్ధిదారులే ఉండాలి. వాటిని విక్రయించినా, కొనుగోలు చేసినా నేరమే. ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనపర్చుకుంటున్నాం.

\- వెంకటరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్, సూర్యాపేట

జిల్లాలో 36,200 ఎకరాల భూములు కేటాయింపు

సూర్యాపేట జిల్లా పరిధిలో సుమారు 36,200 ఎకరాలను ఎస్సీ ఎస్టీ, బీసీలకు కేటాయించారు. సుమారు 38,042మంది పైచిలుకు కుటుంబాలకు ఆయా భూములను పంపిణీ చేశారు. అందులో జిల్లావ్యాప్తంగా సుమారు 14వేల మంది ఎస్సీలకు సుమారు 12వేల ఎకరాలు, 7వేల మంది ఎస్టీలకు 7,700 ఎకరాలు, 17,130మంది బీసీలకు 16,500 ఎకరాలను కేటాయించారు. అయా భూములు ఎక్కువ భాగం లబ్ధిదారుల చేతుల్లో కాకుండా భూకబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. అంతేకాక పలు ప్రాంతాల్లోని భూముల్లో ఇప్పటికే నిర్మాణాలు కూడా చేసి ఉన్నారు. జిల్లాలోని పట్టణాలకు ఆనుకుని ఉన్న మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములకు సమీపంలోని భూముల ధర ఎక్కువగా ఉండడంతో అన్యాక్రాంతమయ్యాయి.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి ఎడ్లపందేల పోటీలు



పోటీల్లో బండ లాగుతున్న ఎద్దులు

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 24: నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని కోనేటిపురం శివారు వద్ద గుట్టపై వెలసిన తిరుమలనాథ స్వామి జాతర సందర్భంగా శనివారం నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేల పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. సాయంత్రం ఎద్దుల పందేల పోటీలను బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి ఎద్దుల పందేలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

విజేతలు ఇలా... పోటీల్లో 3,119.10 అంగుళాల పొడవు బండను లాగిన కృష్ణాజిల్లా విజయవాడకు చెందిన మేక కృష్ణమోహన్ ఎద్దుల జత ప్రథమ స్థానం సాధించాయి. 2,613.06 అంగుళాల దూరాన్ని లాగిన గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన ఎల్లం సాంబశివరావు ఎద్దుల జతలు రెండో స్థానం, 2606.06 అంగుళాల దూరాన్ని లాగిన హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి, విజయవాడకు చెందిన కృష్ణమోహన్‌కు చెందిన ఎద్దుల జతలు సంయుక్తంగా 3వ బహుమతిని, 2,367.05 అంగుళాల దూరాన్ని లాగిన ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం, జేసీ అగ్రహారానికి చెందిన లక్కు మునీశ్వరయ్యకు చెందిన ఎద్దుల జతలు 4వ స్థానాన్ని, 2,237అంగుళాల దూరాన్ని లాగిన గుంటూరు జిల్లా పొన్నూరు మండలం సీతారాంపురానికి చెందిన దాసరి నారాయణరావు ఎద్దుల జత 5వ స్థానాన్ని, 400 అంగుళాల దూరాన్ని లాగిన నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన నాగలక్ష్మీమల్లేష్ ఎద్దుల జతలు 6వ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

అమృత్ భారత్ స్టేషన్‌గా మిర్యాలగూడ



మిర్యాలగూడ రైల్వే స్టేషన్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 24: మిర్యాలగూడ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్‌గా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన రైల్వే శాఖ రాష్ట్రంలోనూ పలు స్టేషన్లకు మెరుగులు దిద్దుతోంది. ఇప్పటికే ఆధునికీకరణ పనులు కొనసాగుతుండగా ఈ నెల 26న ఆయా స్టేషన్లను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లతో పాటు అమృత్ భారత్ రైలు ప్రయాణించే మార్గాల్లోని ప్రధాన స్టేషన్లను తొలి విడతలో ఎంపిక చేశారు. అభివృద్ధిలో భాగంగా స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్స్, సిట్టింగ్, ఫ్లోరింగ్ ఏరియాలను ఏర్పాటుచేయడంతో పాటు పార్కింగ్ ప్లేస్‌ను సుందరమయంగా మార్చనుండగా మిర్యాలగూడ స్టేషన్ అభివృద్ధి కోసం రూ.9.50 కోట్లు కేటాయించారు.

గొర్రెల దొంగల అరెస్టు... రిమాండ్



గొర్రెల దొంగలను చూపుతున్న ఎస్ఐ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24: గొర్రెలు ఎత్తుకెళ్లిన ఇద్దరు ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుకు చెందిన రేగట్టె భూపాల్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడెం రెవెన్యూ శివారులోని తన స్థలంలో షెడ్డు నిర్మించి గొర్రెల పెంపకం చేపట్టాడు. ఈ నెల 15న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షెడ్డులో ఉన్న రూ.10లక్షల విలువైన 110 గొర్రెలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేసి ఎల్‌బీనగర్‌కు చెందిన దొతుల పవన్‌కల్యాణ్, బాలాపూర్ మండ లం షరీఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆజీమ్ రెండు డీసీఎం వాహనాల్లో వచ్చి గొర్రెలను తీసుకువెళ్లి షరీఫ్‌నగర్‌లో దాచి ఉంచినట్లు గుర్తించారు. ఇచ్చిన సమాచారం మేరకు గొర్రెలను స్వాధీనం చేసుకుని నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐపేర్కొన్నారు. సమావేశంలో పీసీ గిరిధారి, హోంగార్డు వెంకన్నలు ఉన్నారు.

శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి

- విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ పుణ్య స్నానాలు
- రాత్రికి దేవతోద్వాసన..శ్రీపుష్పయాగం
- కల్యాణ లక్ష్మీనృసింహుల దోలారోహణం



పాతగుట్ట ప్రధానాలయ యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24: పాతగుట్ట(పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం యాగశాలలో మహాపూర్ణాహుతి, కొండపైన విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానాలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ ప్రధానాలయంలోని స్వయంభువులను కొలిచిన అర్చకులు ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో నవకలశ స్నపనం నిర్వహించారు. యాగశాలలో మూలమంత్ర, మూర్తిమంత్ర, పంచసూక్త వేద మంత్ర పఠనాలతో హోమ పూజలతో మహాపూర్ణాహుతి పర్వాలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయంలో కొలువుదీరిన స్వామివారి చక్రరాజం(సుదర్శనచక్రం) సుదర్శనాళ్వారును దివ్యమనోహరంగా అలంకరించి, సేవలో తీర్చిదిద్దిన అర్చకులు మంగళవాయిద్యాలు, వేదమంత్ర పఠనాలతో పాతగుట్ట కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. విష్ణుపుష్కరిణి వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు, రుత్విక్కుబృందం వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించి పుష్కరిణిలో చక్రతీర్థ స్నానాలు ఆచరించారు. రాత్రి వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు సేవలో తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి దేవతోద్వాసన, వివిధ రకాల పుష్పాలతో శ్రీపుష్పయాగం జరిపి డోలారోహణం ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవ వైదిక పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం నిర్వహించగా ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, ఏఈవో గజ్వేల్ రమేశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



చక్రతీర్థ స్నానాలు ఆచరిస్తున్న అర్చకస్వాములు, అధికారబృందం



యాదగిరికొండపై భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. వారాంతంతో పాటు మేడారం జాతర కొనసాగుతుండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఇష్టదైవాల దర్శనాలకు తరలివచ్చారు. స్వామివారి ధర్మదర్శనానికి 3గంటలు, వీఐపీ టికెట్ దర్శనానికి గంట సమయం పట్టింది. 25వేల మందికి పైగా భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.30,63,104 ఆదాయం సమకూరింది. ఇదిలా ఉండగా స్వామికి నిత్యారాధనలు ఘనంగా కొనసాగాయి. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

జల్సాల కోసం డీజే పరికరాల దొంగతనం

రూ.25 లక్షల పరికరాలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేట క్రైం, ఫిబ్రవరి 24 : జల్సాల కోసం డీజే సౌండ్స్ పరికరాలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను సూర్యాపేట పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ రవి వెల్లడించారు.తుల్సా హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కోదాడకు చెందిన తన మిత్రులు దరావత్ బాలకృష్ణ, బర్మావత్ గురుచరణ్, నల్లగొండకు చెందిన రమావత్ వంశీతో కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో లాంగ్‌డ్రైవ్‌కు కార్లను అద్దెకిచ్చే ట్రావెల్స్ వద్ద కారును అద్దెకు తీసుకుని డీజే సౌండ్ సిస్టమ్‌లకు సంబంధించిన పరికరాలను చోరీ చేసి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సా చేయాలని పథకం రచించారు. అందులో భాగంగా అందరూ కలిసి గతేడాది నవంబరు నుంచి సూర్యాపేట, కోదాడ, చివ్వెంల, చిలుకూరు, ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల ప్రాంతాల్లో డీజే సౌండ్స్‌కు చెందిన ఎలక్ట్రానిక్ పరికరాలను చోరీ చేశారు. చోరీ చేసిన వాటిని కోదాడ ప్రాంతంలో ఒక చోట భద్రపరిచారు.

హైదరాబాద్‌కు తరలిస్తూ..

కోదాడలో భద్రపరిచిన వస్తువులను హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించి నిందితుడు తుల్సా వాహనంలో వాటిని తీసుకెళ్తున్నాడు. అదేసమయంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు ప్రతి రోజూ చేపట్టే వాహన తనిఖీలను సూర్యాపేట పట్టణ పోలీసులు శనివారం ఉదయం జనగాం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో తుల్సా వాహనం అక్కడికి రాగానే వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో డీజే సౌండ్స్‌కు చెందిన ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయి. వాటి గురించి ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో తుల్సాను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో దొంగతనాల గురించి అంగీకరించాడు. వాహనంలో సుమారు రూ.25లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికాలను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులపై కేసు నమోదుచేశారు. ప్రస్తుతం తుల్సాను మాత్రమే కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్లు మిగిలిన ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుల్లో తుల్సాపై గతంలో నరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బైక్ దొంగతనం కేసు, బాలక్రిష్ణ, గురుచరణ్‌లపై కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులు నమోదై ఉన్నాయని డీఎస్పీ రవి తెలిపారు. సమావేశంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్, పట్టణ ఎస్ఐలు ఎస్‌కే యాకుబ్, పీ లోకేష్, బాలక్రిష్ణ, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, ఆనంద్, మధు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు తొమ్మిది సీట్లు కేటాయించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్




గుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు తొమ్మిది ఎంపీ సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా చైతన్యమయ్యారని, వారిని ఎదగనివ్వకుండా అడ్డుకోవాలన్న ఉద్దేశంతో పార్టీలు ప్రాధాన్యం ఇవ్వకుండా తొక్కివడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఖచ్చితంగా తొమ్మిది సీట్లు కేటాయించాల్సిందేనని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి సీటు బీసీలకు ఇవ్వాల్సిందేనని, లేదంటే అన్యాయం చేసిన పార్టీలకు బీసీల సత్తాచూపి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గతంలో బీజేపీ బీసీ అభ్యర్థిని సీఎం చేస్తానని ఎన్నికల్లో ప్రకటించి కనీసం బీసీలకు ప్రాధాన్యం లేకుండా చేసిందని, మాజీ సీఎం కేసీఆర్ తమ బీఆర్ఎస్ పార్టీ తరఫున శాసనసభలో కనీసం పార్టీ పక్షనేతగా ప్రకటించలేదన్నారు. ఇటీవల రాహుల్‌గాంధీని కలిసి బీసీ గణన చేపట్టాలని బీసీ నాయకులంతా కలిసి కోరితే తప్పకుండా చేపడతామని, దానిని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారని చెప్పారు. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బీసీ గణన చేపట్టాలని కోరగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అంగీకరించారని, అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నర్సింహస్వామి, గుండు నర్సింహగౌడ్, గుండు జ్యోతి, పేరపు రాములు, అంకంపల్లి వెంకటరత్నాచారి, గుజ్జ బలరాం, బొజ్జ శాంబేష్, పర్వతాలు, రాజు, రవి పాల్గొన్నారు

బిర్యానీ సెంటర్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 24: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని బిర్యాని సెంటర్‌లో గ్యాస్ సిలిండర్ పేలింది. రైల్వే స్టేషన్ ఎదు రుగా పరివార్ బిర్యాని సెంటర్ నడిపిస్తున్న కిషోర్, కృష్ణ వంట చేస్తున్న క్రమంలో పొగలు రావడంతో బయటకు వెళ్లిపోయారు. కొద్దిసేపటికే గ్యాస్ సిలిండర్ పేలింది. అ గ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. గ్యాస్ లీక్ అవడంతోనే ప్రమాదం జరిగిందని, రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిదని ఫైర్ స్టేషన్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

కారు ఆటో ఢీ, మహిళ మృతి



ఎల్లమ్మ

అర్వపల్లి, ఫిబ్రవరి 24: ఆటోను అతివేగంతో కారు ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి చెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ మహేందర్‌నాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం తిమ్మాపురం నుంచి మాదారం గ్రామానికి ఆటోలో ఏడుగురు బయలుదేరారు. గోపాల్‌రెడ్డినగర్ సమీపంలోకి రాగానే అర్వపల్లి నుంచి సూర్యాపేటకు వెళ్తున్న కారు అతివేగంగా ఆటోను ఢీకొట్టింది.ఈ ఘటనలో కోడూరు గ్రామానికి చెందిన గంట ఎల్లమ్మ(40) తీవ్ర గాయాలపాలై మృతి చెందగా, ఆటో డ్రైవర్ బొడ్డు లక్ష్మణ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బొడ్డు స్వరూప, బొడ్డు ఎల్లమ్మకు తీవ్ర గాయాలు కావడంతో 108వాహనంలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.ఆటోలోని ఇద్దరు చిన్నారులకు గాయాలు కాలేదు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌నాథ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


రోడ్డు మూల మలుపును పరిశీలిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని బీవెల్లెంలలో హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదకరంగా మారిన మూల మలుపు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామని రోడ్లు భవనాల శాఖ డీఈఈ సుధాకర్‌రెడ్డి అన్నారు. బీవెల్లెంల నుంచి మునుగోడుకు వెళ్లే రోడ్డుకు ఎదురుగానే కొత్తగూ డేనికి వెళ్లే పీఆర్ రోడ్డు కూడా ఉంది. కానీ ఏ రోడ్డు ఏ ఊరికి వెళ్తుందో తెలిపే బోర్డులు, ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులు ముఖ్యంగా రాత్రివేళ అయోమయానికి గురవుతున్నారు. ఫలితంగా 15రోజుల వ్యవధిలో ఈ మూలమలుపు వద్ద ఏడు రోడ్డు ప్రమాదాలు సంభవించి పలువురు గాయపడ్డారు. ఈ సమస్యను కాంగ్రెస్ నాయకుల ద్వారా బాధితులు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన డీఈఈ శనివారం సదరు ప్రమాదకర మూలమలుపును పరిశీలించారు. జీబ్రాలైన్ స్పీడ్ బ్రేకర్లు, గ్రామాల పేర్లతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొడిగె స్వామి, చిరుమర్తి ధర్మయ్య, సోమనబోయిన లక్ష్మణ్, నాగరాజు, గణేశ్, యాదగిరి, సాయిరాం, రామారావు, ఠాగూర్, ప్రేమ్ పాల్గొన్నారు.

ముగిసిన హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు

చింతపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని పేకేమల్లేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉర్సు ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాతోపాటు రంగారెడ్డి, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు దర్గాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు దర్గా ముతవల్లి ఎండి. చాంద్‌పాష తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు చైర్మన్ కేపీ. రమేష్‌రాజ్, దర్గా ముతవల్లి చాంద్‌పాష కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జానిమియా, జయ్యద్‌పాష, యూసుఫ్ పాష, కలీల్ పాష, కృష్ణ, అబ్బయ్య, వెంకటేష్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

తిప్పర్తి, ఫిబ్రవరి 24: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. బాబ కోరారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ నుంచి నల్లగొండ జిల్లా డిండి నుంచి ఈ యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మార్చి 1వ యాత్ర తిప్పర్తి మండల కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండా వినయ్‌కుమార్, వంగూరి రవి, బ్రహ్మాచారి, నాగరాజు, గడ్డం వెంకట్‌రెడ్డి, ప్రకాష్, అంక వెంకటేశ్వర్లు, నకిరేకంటి మహేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తాం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24: ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్ తెలిపారు. మండలంలోని అమ్మనబోలు- పోడిచేడి మూసీవాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కథనంపై కలెక్టర్ హరిచందన ఆరా తీశారు. ఆమె ఆదేశాల మేరకు శనివారం వారు అమ్మనబోలు గ్రామాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో సహకరించాలని గ్రామస్థులను కోరారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని రాగం భవ్యశ్రీ బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. 9వ తరగతి చదువుతున్న భవ్యశ్రీ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం విజయకుమారి తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో మార్చి 10నుంచి జాతీయ స్థాయి(జూనియర్) పోటీలు జరగనున్నట్లు తెలిపారు. భవ్యశ్రీని పీఈటీ నామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు కవిత అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బహుమతులు అందజేస్తున్న జెన్‌కో ఎస్‌ఈ రఘురాం

నాగార్జునసాగర్, ఫిబ్రవరి24: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని జెన్‌కో ఎస్‌ఈ రఘురాం అన్నారు. రామచంద్ర మిషన్‌లో భాగమైన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో సాగర్ హైలాన్‌కాలనీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ తదితర పోటీల విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. యువతలో నెలకొన్న స్తబ్దతను తొలగించడానికి క్రీడలు నిర్వహించాలన్నారు. హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ జోనల్ కో ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో పాటు ధ్యానంతో విద్యార్థుల్లో ఏకగ్రత పెరుగుతుందన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య, హార్ట్ ఫుల్‌నెస్ కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, కేవీ, సత్యేంద్రప్రకాష్, అహల్య, చిరంజీవి, రాజు, ప్రసన్న, సత్యనారాయణ, నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

కట్టంగూర్, మాడ్గులపల్లి, నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24: కట్టంగూర్ మండలంలోని రామచంద్రాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సాందీపని పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొండ శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు జూలకంటి జ్యోతి, గుండగోని వసంత, మాంద్ర సంపత్, గట్టిగొర్ల యాదగిరి, వెంకటప్రసాద్, రేణుక, లావణ్య, నాగమణి ఉన్నారు. మాడ్గులపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్ర, ఉపాధ్యాయులు అరుణ్, రమేష్ ఉన్నారు. నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. లింగయ్య బహుమతులు అందజేశారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

రామగిరి, ఫిబ్రవరి 24: వచ్చే నెలలో రంజాన్ మాసం ప్రారంభమవుతున్నందున ఈద్గాల వద్ద కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేయాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని 12వ వార్డులో ఉన్న ఈద్గాను కౌన్సిలర్లు, ఈద్గా కమిటీ సభ్యులతో కలిసి ఈద్గాను పరిశీలించారు. గ్రేవ్‌యార్డ్స్ అన్నింటినీ శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథుని కల్యాణం


తిరుమలగిరి సాగర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


కనగల్: పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 24: వేలాది మంది భక్తులు తరలిరాగా పద్మావతి సమేత తిరుమలనాథుడి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా మాఘశుద్ధ పౌర్ణమినాడు కోనేటిపురం శివారులోగల తిరుమలయ్య గుట్టపై వెలసిన పద్మావతి సమేత తిరుమలనాథుని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచే స్వామి, అమ్మవార్లకు గుట్టపై గల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవ విగ్రహాలను గుట్ట కింద గల కల్యాణమండపంలో ఆలయ ప్రధాన అర్చకులు రాయప్రోలు మురళీశర్మతోపాటు ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కల్యాణతంతును నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. జాతర సందర్భంగా కొండపైకి వివిధ వాహనాల్లో భక్తులు వెళ్లి స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కుంకుడుచెట్టుతండా గ్రామస్థుల సహకారంతో మహా అన్నదానం నిర్వహించారు. ఆలయంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, వెంపటి శ్రీనివాస్, ధర్మకర్త పేలపోలు శ్రీను ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణం అనంతరం మహిళలచే కోలాటం నిర్వహించారు.

కనగల్: మండలంలోని పగిడిమర్రి గ్రామ శ్రీసీతారామ, లక్ష్మణ, అంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. ఒడిబియ్యం కట్నకానుకలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి దంపతులు, గోలి జగాల్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు తలంబ్రాలను సమర్పించారు. ఎంపీటీసీ ఎర్రమాదయశోదమ్మ, మాజీఎంపీటీసీ సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గోత్ర నామార్చనలు, నీరాజన మంత్రపుష్ప పూజలను అర్చకస్వాములు నిర్వహిచారు. కాగా ఆదివారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి కల్యాణం, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మర్రిగూడ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సరంపేటలో శ్రీ స్తంభగిరి లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు వెంకటాచారి, నర్సింహాచారి, శ్రీనివాసచారి, ఎంపీటీసీ రవీందర్‌రావు, మేతరి యాదయ్య, బేత వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్, వీరితో పాటు రేవంత్, బండి హనుమంత్, యాదయ్య, సరంపేట మాజీ సర్పంచ్ లక్ష్మమ్మవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ కల్చరల్: పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఆనంద్ నగర్‌లో గల శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. మంగళ వాయిద్యాలు మోగు తుండగా వేద పండితుల మంత్రోచ్ఛవాల మధ్య స్వామి వారు అమ్మవారి మెడలో మంగళ సూత్రధారణ తంతును సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైన స్వామి అమ్మవారులను ఆశీనులను చేసి అర్చక స్వాములు రఘునందనాచార్యులు, లక్ష్మీనర్సింహాచార్యులు, శ్రీనివాసశర్మ, లక్ష్మణాచార్యులు పూజలు నిర్వహించిన అనంతరం పుణ్యావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, తలంబ్రాలు తంతును జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారం గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్, సభ్యులు మేరెడ్డి యాదగిరిరెడ్డి, పిచ్చయ్య, నారాయణ పాల్గొన్నారు. పట్టణంలోని పాతబస్తీ హనుమాన్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాయలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వంద మంది దంపతులు సామూహికంగా వ్రతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటేశ్వరశర్మ, ఆలయ అధ్యక్షుడు భైరగోని రాజయ్య, సభ్యులు ఉట్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాల భగవత్ స్వరూపం సంత్ సేవాలాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: బంజారాల భగవత్ స్వరూపం సంత్ సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా నిర్వహించిన భోగ్ బండార్ కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా సేవాలాల్ భవన్ వరకు సేవాలాల్ విగ్రహాన్ని రథంపై ఉంచి ఊరేగించారు. ప్రతి గిరిజన బిడ్డ ఆయన బోధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. సేవాలాల్ జయంతికి ప్రభుత్వం అదనంగా రూ.కోటి మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ విప్ గిరిజన నేతకు ఇచ్చి ప్రాధాన్యం కల్పించారన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బంజారాల పట్ల అపారమైన గౌరవం ఉందన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి గిరిజనుల పట్ల ప్రేమను చాటుకుంటోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో లంబాడాల జాతి గురువు రమేష్ మహరాజ్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, ఎంఈవో బాలా జీనాయక్, ఎంపీపీలు నందిని, బాలునాయక్, బీజేపీ నాయకుడు రతన్‌సింగ్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, కౌన్సిలర్ రవినాయక్, సిద్ధూ నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు దశరథనాయక్, లింగానాయక్, జడ్పీటీసీ భారతి భాస్కర్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీస్టోర్ హమాలీలను రెగ్యులర్ చేయాలి


డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం అందజేస్తున్న జూలకంటి, వీరారెడ్డి

మిర్యాలగూడ అర్బన్, నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 24: రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకేంద్రాల్లోని ఎలక్ట్రిసిటీ స్టోర్లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టివిక్రమార్కకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూలకంటి, తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 220మంది ఎలక్ట్రిసిటీస్టోర్ కార్మికులుగా చేస్తున్నారని తెలిపారు. జిల్లా స్టోర్‌లో నిత్యం విద్యుత్ పరికరాల ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్నారని అన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అవసరమయ్యే పరికరాలను తరలించడంతో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నట్లు మంత్రికి వివరించామన్నారు. బరువైన సామాగ్రిని అత్యంత ప్రమాదకరస్థితిలో ఎత్తుతూ నిత్యం ప్రమాదాలకు లోనవుతూ అభద్రతా భావంతో జీవనం సాగిస్తున్న అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యుత్‌శాఖలో 30ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికుల ప్రయోజనాలను గత ప్రభుత్వం తుంగలో తొక్కిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారందరినీ ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీస్టోర్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య నాయకులు శ్రీనివాస్, శంకర్, యాదగిరిరెడ్డి ఉన్నారు.

పాఠశాలలో విద్యార్థుల నిర్బంధంపై విచారణ

మునుగోడు, ఫిబ్రవరి 24: మునుగోడులోని కైరళి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఫీజుల పేరుతో ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న ఇద్దరు విద్యార్థులను ఇంటికి పంపకుండా తరగతి గదిలో రాత్రి వరకు నిర్బంధించిన విషయంపై డీఈవో బిక్షపతి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మండల నోడల్ అధికారి, స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవీందర్ శనివారం ఆ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఇద్దరు పిల్లలను నిర్బంధించి వేధింపులకు గురిచేసిన విషయంపై యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. రాతపూర్వకంగా ఇచ్చిన నివేదిక తీసుకొని డీఈవోకు పంపనున్నట్లు నోడల్ అధికారి తెలిపారు. ఫీజుల పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఫీజుల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లికార్జున్‌యాదవ్, టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నల్గొండ అంజి డిమాండ్ చేశారు. శనివారం విద్యాశాఖాధికారులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

'కల్యాణలక్ష్మి' ఆడబిడ్డలకు వరం


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, ఫిబ్రవరి 24: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు శనివారం అందజేశారు. పేదింటి ఆడబిడ్డలను ఆదుకునేందుకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రెండు నెలల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.లక్ష 116తోపాటు తులం బంగారం కూడా అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేయగా మరో రెండు గ్యారంటీలను ఈ నెల 27న అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవానిపవన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, తహసీల్దార్ ఎండి.శంషొద్దీన్, ఎంపీడీవో సుజాత, డిప్యూటీ తహసీల్దార్ ఎండి. అర్షద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదయ్య, సింగిల్‌విండో చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ది అనుభవరాహిత్యం'

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిది అనుభవరాహిత్యమని బీఆర్‌ఎస్ గిరిజన నేతలు చిట్టిబాబునాయక్, రవినాయక్ అన్నారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేయకపోవడం ఆయన రాజకీయ అనుభవరాహిత్యానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రూ. కోటి రూపాయలు అదనంగా కేటాయించడం, జయంతి రోజున ఐచ్ఛిక సెలవు మంజూరు చేయడాన్ని హర్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బంజారాలకు ఇచ్చిన హక్కులను కాలరాస్తూ గిరిజన నేతలకు వేదికపై ఫ్లెక్సీలో చోటు కల్పించకపోవడం విచారకరమన్నారు. జయంతి ఉత్సవాలను స్వయంగా తానే చూసుకుంటానని గతంలో ప్రకటించి సేవాలాల్ విగ్రహాన్ని సేవాలాల్ భవన్‌లో ప్రతిష్ఠించకుండానే తన ఇంటికి తీసుకెళ్లి బంజారా సాంప్రదాయాలకు పాతర వేశారన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గిరిజన నేతలు హాతీరాం, వీరానాయక్, సచిన్, కుర్ర శ్రీను, వినోద్‌నాయక్, రాంసింగ్, సైదానాయక్ పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి : జక్కలి

మర్రిగూడ, ఫిబ్రవరి 24: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ, లక్ష్మణాపురం ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయి ముంపునకు గురైన గృహాల బాధిత నిర్వాసితులకు పరిహారం అందించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య డిమాండ్ చేశారు. మర్రిగూడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వల్ల అర్హులైన కొంతమంది భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేయలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ప్యాకేజీతో పాటు త్వరగా పునరావాసం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు దోమల వెంకన్న, పుప్పాల యాదయ్య, ముద్దం శ్రీనివాస్, పగడాల లింగయ్య, అంజయ్య, షర్ఫొద్దీన్, గ్యార నర్సింహా తదితరులు పాల్గొన్నారు

ధర్నాను విజయవంతం చేయాలి : సీపీఐ

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 24: రైతులపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న కాల్పులు, లాఠీ చార్జీలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశ సంపదను, సహజ వనరులను, ప్రభుత్వ ఆస్తులను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం, ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసి కష్టపడి పండించే రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు.

దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 24: ఉమ్మడి పీఏపల్లి మండలంలోని కోదండపురం గ్రామంలోని పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం నూతన పాలక మండలి శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణాచారి, పోచంరెడ్డి సైదిరెడ్డి, పోలే ఇందిరామహేందర్, నక్క బిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, బాలబోయిన వెంకటయ్య, అర్చకులు పొందూరి శ్రీనివాసచార్యులతో దేవాదాయశాఖ ఈవో కుశలయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

శివాలయం అభివృద్ధికి కృషిచేయాలి : ఎమ్మెల్యే

నకిరేకల్, ఫిబ్రవరి 24: నకిరేకల్‌లోని రామలింగేశ్వర స్వామి దేవాలయం (శివాలయం) అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శివాలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు కందాళ ప్రవీణ రత్నారెడ్డి, బొప్పని యాదగిరి, కొండ వెంకన్నగౌడ్, చెన్న చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారంలో పాల్గొని మాట్లాడారు. దేవాలయ అభివృద్ధి సహకరిస్తానన్నారు. నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేరు వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, కౌన్సిలర్ గాజుల సుకన్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ఉన్నారు.

బస్సునుంచి జారిపడి వ్యక్తి మృతి

ఆదిభట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బస్సులో నుంచి జారిపడి ప్రయాణికుడు మృతిచెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన నదిరి రమేష్(36) ప్లంబర్‌గా పనిచేస్తుండేవాడు. తుర్కయాంజాల్‌లో పని ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో దేవరకొండ డిపోకు చెందిన బస్సులో బయలుదేరాడు. ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో ముందు డోర్ వద్ద నిల్చున్నాడు. బస్సు తుర్కయాంజాల్ నుంచి బయలుదేరి కొద్దిదూరం పోగానే పట్టు తప్పడంతో కిందకు జారి పడిపోయాడు. వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి జారి పడడంతో తలకు బలమైన గాయమై రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

మిర్యాలగూడ: స్థానిక ఎన్నెస్పీ మైదానంలోని ఇండోర్ స్టేడియం, హౌసింగ్‌బోర్డులోని క్లియో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కోచ్ మారబోయిన రామకృష్ణ, క్లియో స్పోర్ట్స్ ఎండీ ఏచూరి హర్ష తెలిపారు. పోటీలకు లాస్య కంప్యూటర్ అధినేత గుడిగుంట్ల రవి కిరణ్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. పట్టణంలోని బచ్‌పన్ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, డైరెక్టర్ ఎండీ. నూరుద్దీన్, ప్రిన్సిపాల్ రాధిక, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవరకొండ మండలంలోని గిరిజానగర్‌తండాకు చెందిన నేనావత్ మల్లేష్‌నాయక్‌ను నియమించారు. సంఘం బలోపేతానికి కృషిచేస్తానని, తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు మల్లేష్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

గుర్రంపోడు: బీఎస్పీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలె శ్రీను, కార్యదర్శిగా పాలడుగు శశిధర్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, బత్తుల ప్రసాద్, పోలె సుధాకర్, పోలె ప్రవీణ్, పోలె రాకేష్ పాల్గొన్నారు.

హాలియా: హాలియా పట్టణానికి చెందిన అక్షయ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వహీద్ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వహీద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ సుమతిపురుషోత్తం, షేక్ మున్నా, షేక్ గౌస్, అబ్దుల్ హలీం, జలీల్, షరీఫ్, కుంటిగొర్ల పాపయ్యయాదవ్, కొట్టాల శ్రీను ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. పట్టణ పరిధిలో రూ.25.49 కోట్ల ఆస్తి పన్ను బకాయిలుండగా, సుమారు రూ.5.50కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. వసూళ్లకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, నూరు శాతం వసూళ్లు సాధిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం..

మునిసిపాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు వెంటనే పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

చిట్యాల రూరల్: మండలంలోని వేంబాయికి చెందిన గుసగంటి వెంకటేష్ కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. 1994-95 సంవత్సరంలో కలిసి చదువుకున్న స్నేహితులు విషయం తెలుసుకొని అందరూ కలిసి రూ.50 వేలు సేకరించి మిత్రుడికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీను, నర్సింహ, లింగయ్య, పాండు, కవిత, సుజాత, రూప, తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలంలోని చందంపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా మేడబోయిన సైదులు, ఉపాధ్యక్షుడు యారా వెంకన్న, కార్యదర్శి మాచర్ల యాదగిరి, కోశాధికారి దోమలపల్లి ఉపేందర్, సహాయ కార్యదర్శి కలిమెర మహేష్, గౌరవ సలహాదారులుగా మండడి శిశుపాల్‌రెడ్డి, వంగూరి నర్సింహ్మ, మాదగోని సతీష్‌గౌడ్ ఎన్నికయ్యారు.

హాలియా: విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాన్ని చేరుకోవాలని హాలియా సీఐ రాఘవరావు అన్నారు. హాలియాలోని కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే సెలబ్రేషన్స్‌లో మాట్లాడారు. ఇష్టపడి చదువు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాలియా ఎస్ఐ. సతీష్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హాలియా: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఈనెల 25వ తేదీన నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాగార్జునసాగర్ నియోజకవర్గ నాయకుడు సభావట్ పాండునాయక్ కోరారు. హాలియాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బంజారా సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శాలిగౌరారం: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్ జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించే మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించే పోస్టర్‌ను శాలిగౌరారం అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చింత ధనుంజయ్య, జహంగీర్, సుల్తాన్, వెంకన్న, బొల్లికొండ గణేష్, అన్నెబోయిన అనిల్, చిల్లంశెట్టి సాయి, బట్ట అనిల్, మిర్యాల సాయి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణితం, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు, ఎంపీపీ రేఖారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వరరెడ్డి, మంగ్యానాయక్, వలమల అంజనేయులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ఉపాధ్యాయులకు నష్టాన్ని కలిగించే జీవో 317ను పరిశీలించేందుకు ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు కందిమల్ల కృష్ణారెడ్డి, అధ్యక్షుడు బిలుముల బాలరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొడదల శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 317జీవోపై పోరాటం చేసి ప్రభుత్వం సబ్ కమిటీ వేసేలా కృషి చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి, పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వేములపల్లి: మండలంలోని రావులపెంట మూసీ వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన శీలం సైదులు, ఉత్తెర్ల సైదులు తమ ట్రాక్టర్ల ద్వారా మూసీ వాగులో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

తిప్పర్తి: మాడ్గులపల్లి మండలంలోని చిరుమర్తి గ్రామానికి చెందిన ఆకిటి శేఖర్ ట్రాక్టర్‌తో చిరుమర్తి నుంచి తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి ఇసుక తరలిస్తున్నాడు. పోలీసులు ట్రాక్టర్‌ను ఆపి అనుమతి చూపించాలని అడగడంతో అనుమతి లేదని చెప్పడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.